క్లుప్తంగా

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



డిచ్‌పల్లి: టీఎస్ ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిచ్‌పల్లి ఆర్టీసీ కంట్రోలర్ చందర్‌నాయక్ సూచించారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో బుధవారం ఆయన ప్రజలకు ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు 50శాతం రాయితీ, విద్యార్థులకు ఉచిత బస్ పాస్, టీ9 టికెట్ తదితర సేవలను వివరించారు. దివ్యాంగుల నుంచి బస్‌పాస్ కోసం దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ శక్కరికొండ కవిత మోహన్, కార్యదర్శి సునీల్, బిల్‌కలెక్టర్ శంకర్, కారోబార్ రవి పాల్గొన్నారు.

సమగ్ర వేతనం చట్టం చేయాలి



సిరికొండ: వ్యవసాయ కార్మికులకు సమగ్ర వేతన చట్టం చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఉప తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందచేశారు. రామకృష్ణ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం అమలు చేసి, జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్, సాయారెడ్డి, రమేష్, లింబన్న, అనీస్, రాజన్న, గంగమల్లు, నాగన్న, మనోజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ఖలీల్‌వాడి: నగరంలోని పాములబస్తీ కాలనీకి చెందిన పలువురు మహిళలు బుధవారం మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలందరికీ అండగా ఉండి సమస్యలను పరిష్కారిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నేత సాగర్ తదితరులు ఉన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో 70 శాతం కన్వీనర్ కోట సీట్లను మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలన్నారు. స్పాట్ కౌన్సెలింగ్ పేరుతో కన్వీనర్ కోటా సీట్లను ప్రైవేట్ కళాశాలలు అమ్ముకుంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు.

పోగొట్టుకున్న సెల్ అందజేత

డిచ్‌పల్లి: మండలంలోని అమృతపూర్‌కు చెందిన గుండం నరేష్ ఈ నెల 26న డిచ్‌పల్లి మార్కెట్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, బుధవారం ఎస్సై గణేష్ సెల్‌ఫోన్‌ను ఆయనకు అందజేశారు. సెల్‌ఫోన్ పోవడంతో సీఈఐఆర్ పోర్టల్ వివరాలు నమోదు చేసి, కేసు నమోదు చేయడంతో సెల్‌ఫోన్‌ను అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రభుత్వం బీసీ కులాల వారికి అందజేస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఎంపీడీఓ లింగం నాయక్ బుధవారం మండలంలోని ముదక్‌పల్లిలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అర్హులైన వారిని గుర్తించి పూర్తి వివరాలతో కూడిన జాబితాను బీసీ సంక్షేమశాఖకు నివేదిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

క్యాన్సర్ వైద్యశిబిరం



ఖలీల్‌వాడి: నాగారం బహుజన కాలనీలో బుధవారం ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు మల్యాల గోవర్ధన్ పర్యవేక్షణలో క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలో అనేక ప్రాంతాలలో క్యాన్సర్ పై అవగాహనతో పాటుగా టెస్టులు, వైద్యం, ఉచిత మందుల పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు కోశాధికారి ఈవీఎల్ నారాయణ పేర్కొన్నారు. వైద్యులు రవీంద్రనాథ్ సూరి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నార

త్వరలోనే కొత్త భవనంలోకి మున్సిపాలిటీ

- పాతభవనంలోకి ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు
- నుడా ఆఫీస్, వెల్‌నెస్ సెంటర్ కూడా..

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయం అతి త్వరలోనే నూతన భవనంలోకి మారనుంది. ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయి. 95 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ కార్యాలయం పక్కనే నూతన భవన నిర్మాణం జరుగుతుంది. జూలైన 15లోగా మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ భవనం ప్రారంభించడానికి అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారు.

అన్ని కార్యాలయాలు ఒకే గొడుకు కిందికి..

మున్సిపాలిటీ కార్యాలయం ఖాళీ కాగానే మొదటి అంతస్తులోకి నుడా కార్యాలయం రానుంది. ప్రస్తుతం నుడా కార్యాలయం కంఠేశ్వర్‌లోని ఈ–సేవా భవనంపై అద్దె ప్రాతిపదికన కొనసాగుతుంది. నూడా నూతన భవన నిర్మాణం కోసం పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్థల సేకరణ చేపట్టారు. భవన నిర్మాణం కోసం రూ. 2 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. అలాగే మున్సిపాలిటీలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఆర్డీవో కార్యాలయం నిర్మల్‌హృదయ్ ఎదుట భవనంలో కొనసాగుతుంది. అలాగే నార్త్, సౌత్ తహసీల్దార్ కార్యాలయాలు కూడా పాత మున్సిపల్ ఆఫీసులోకే రానున్నాయి. నార్త్ తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం అయ్యప్ప గుడి వెనుక ప్రాంతంలో, సౌత్ తహసీల్దార్ కార్యాలయం ఇరిగేషన్ భవనంలో కొనసాగుతుంది. అన్ని కార్యాలయాలు ఒకే వద్దకు రానున్నాయి. ఇటీవల ఆర్డీవో రవి మున్సిపాలిటీ భవనాన్ని పరిశీలించారు.



మున్సిపల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో(ఫైల్)

మున్సిపాలిటీ పౌరసేవా కేంద్రంలోకి..

ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్,జర్నలిస్టుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ ప్రస్తుతం జీజీహెచ్(ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి)లో కొనసాగుతుంది.వెల్‌నెస్ మార్చాలని ఉద్యోగులు,పెన్షనర్లు, జర్నలిస్టులు కలెక్టర్, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించారు. అయితే మున్సిపాలిటీ పౌరసేవ కేంద్రం భవనంలోకి మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పీవీకి భారతరత్న ప్రకటించాలి



పీవీకి నివాళులు అర్పిస్తున్న తెలుగు వెలుగు సమాఖ్య ప్రతినిధులు..



బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

- బ్రాహ్మణ సంక్షేమ సంఘం డిమాండ్
- ఘనంగా పీవీ నర్సింహరావు జయంతి

నిజామాబాద్ సిటీ: భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నర్సింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలోని మహాలక్ష్మీనగర్ బ్రాహ్మణ సంఘంలో బుధవారం పీవీ నర్సింహరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. భారతదేశ ఆర్థిక వ్యవస్థను బ్రహ్మాండంగా నిర్వర్తించిన గొప్ప మేధావి పీవీ నరసింహరావు అని అన్నారు. సంఘ అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్, గౌరవ అధ్యక్షుడు కంజర్కర్ భూపతిరావు, కోశాధికారి రమేష్ కులకర్ణి, సభ్యులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, కిష్టయ్య, కోస్లీ చంద్రశేఖర్, వాస్తు సుధాకర్, జయంత్, జగపతిరావు, అమరేశ్వర్ పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో పీవీ నర్సింహరావు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ.. పీవీ నర్సింహరావు భారతదేశ ఆర్థిక పరిస్థితి చక్కదిద్ది భావి భారతానికి బంగారు బాటలు వేశారన్నారు. జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, కవులు పంచరెడ్డి లక్ష్మణ, తిరుమల శ్రీనివాస్ ఆర్య, నరేశ్, సందీప్, సందేశ్ పాల్గొన్నారు.



తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సీతారాంనగర్‌కాలనీలోగల తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య కార్యాలయంలో బుధవారం సమాఖ్య ఆధ్వర్యంలో పీవీ నర్సింహరావు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంగీత కళాకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డా.అయాచితం నాగరాజశర్మ, సమాఖ్య కార్యదర్శి చంద్రశేఖర్, కవి, సభాసమ్రాట్ చందన్‌రావు, సముద్రాల రాములు, నర్సింహాం, వెంకటరామారావు, తదితరులు ఉన్నారు.

బీడీ కార్మికులకు న్యాయం చేయండి

ఖలీల్‌వాడి: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని, కురుకురే ప్యాకెట్లు కొనాలని బీడీ కార్మికులపై ఒత్తిడి చేస్తున్న దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కురుకురే ప్యాకెట్లు కొంటేనే కార్మికులకు ఆకు, తంబాకు వేస్తామని దేశాయ్ బీడీ యజమాన్యం కార్మికులను బెదిరిస్తున్నారని, 1000 బీడీలకు రూ.9చొప్పున తీసుకుంటున్నారని ఆరోపించారు. యజమాన్యంపై చర్యలు తీసుకోకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు లక్ష్మి, సుజాత, ధనలక్ష్మి, విమలమ్మ, పద్మ, వసంత తదితరులున్నారు.



కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

నూతన కార్యవర్గం ఎన్నిక

రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్..



నిజామాబాద్ సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ నూతన కార్యవర్గాన్ని (2023–24) ఎన్నుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సూర్యప్రకాష్ బుధవారం తెలిపారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా భూలోకం విజయకాంత్ రావు, కార్యదర్శి బంగారు వీరబ్రహ్మాం, కోశాధికారి డాక్టర్ అనంత్ కులకర్ణిలను క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జూలై 2న కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తామన్నారు.

సిరికొండ వీడీసీ..



సిరికొండ: సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బడాల సంతోష్, వైస్ చైర్మన్‌గా ఆకు గంగారాం, కోశాధికారిగా గోపి, రైటర్‌గా ప్రవీణ్, సలహదారులుగా రాజేంధర్‌గౌడ్, లింగం, సభ్యులుగా చిట్యాల శ్రీధర్, శ్రీనివాస్, శివారెడ్డి, చింటు, గంగాధర్, సురేష్, మధు, శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు



ధర్పల్లిలో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్పల్లి: ప్రస్తుతం 30 పడకలతో ఉన్న ధర్పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ని వంద పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడం తో బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం టపాకాయలను కాలుస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్ రెడ్డి, నాయకులు రాజ్ పాల్ రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: ధర్పల్లి ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంపై మండల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ మాన్‌సింగ్, నాయకులు శ్రీనివాస్, తిర్మల్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



సిరికొండ మండల కేంద్రంలో..

రాజకీయలబ్ధి కోసమే అసత్య ఆరోపణలు

వేల్పూర్: వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందాలన్న ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వేల్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వేల్పూర్‌లోని మంత్రి ప్రశాంత్‌రెడ్డి నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంతో పాటు, బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. రహదారుల నిర్మాణంలో కాంట్రాక్టరు ద్వారా మంత్రి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి, ఆయన తల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుకు కూడా అదే కాంట్రాక్టరు రహదారులు నిర్మించిన విషయాన్ని మరచిపోయారా అని ప్రశ్నించారు. కమీషన్లు తీసుకోవాల్సిన అవసరం మంత్రికి లేదన్నారు. అభివృద్ధిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు చౌకబారు ఆరోపణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అసత్య ఆరోపణలు మానుకోకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు మిట్టపల్లి మహిపాల్, మోహన్‌రెడ్డి, రేగుల్లరాములు, నాగధర్ రెడ్డి, లింబారెడ్డి, రాజేశ్వర్, రాజ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, తలారి శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఎడపల్లి(బోధన్): అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా సిబ్బంది కృషి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, పనితీరుపై ఎలాంటి ఆరోపణలు వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామని మండల పర్యవేక్షకురాలు వినోద అన్నారు. మండలంలోని జానకంపేటలో బుధ వారం మండల అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైనందున కేంద్రాలలో అర్హులైన పిల్లల నమోదును పెంచాలన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే పీఎం మోదీ లక్ష్యం

సుభాష్‌నగర్: దేశంలోని అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పీఎం మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా పేర్కొన్నారు. నగరంలోని 7వ డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ సుక్క మధుతో కలిసి బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. మోదీ పాలనలో అట్టడుగు వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కుటుంబ పాలనను అంతమొందించాలంటే బీజేపీతోనే సాధ్యమని, మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే బీజేపీకి ఓటేయాలని మోదీ పిలుపునిచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో అర్బన్ ఎమ్మెల్యేకు ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి చినకారి నరేష్, బూత్ అధ్యక్షుడు నందకిషోర్, రఘువీర్, ఆనంద్, నాగోల్ల లక్ష్మీనారాయణ, గోపిడి వినోద్ రెడ్డి, ఇప్పకాయల కిషోర్, బూర్గుల వినోద్, ప్రభాకర్, హరీష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుషాల్, నాయకులు పాల్గొన్నారు.

తెయూలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, జయంతి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్ లేక నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల విద్యార్థులు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంజనీరింగ్ చదువుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ధర్పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాట్‌పల్లి నగేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణాల మాఫీ చేస్తామని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ ను రద్దుచేసి, వరికి క్వింటాలుకు రూ.2,500 మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు. అనంతరం రేకులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీకాంత్ తల్లి మరణించడంతో ఆమె అంత్యక్రియలు పాల్గొని నివాళులు అర్పించారు. నాయకులు గంగారెడ్డి, నర్సయ్య, లక్ష్మయ్య, నారాయణ, బాలరాజు, రాకేష్ తదితరులు ఉన్నారు.



ధర్పల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న కాట్‌పల్లి నగేష్ రెడ్డి

సైబర్ మోసాలపై అవగాహన

రుద్రూర్: కోటగిరి మండలం దోమలెడ్గి గ్రామంలో బుధవారం ప్రజలకు సైబర్ మోసాలపై పోలీసులు అవగాహన కల్పించారు. కోటగిరి ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పద్దని, గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులు ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయద్దన్నారు. సైబర్ నేరాలపై పూర్తిగా అవగాహన ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,550	వెండి (కిలో)	73,500
22 క్యారెట్స్	55,823	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	64	90	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	100	130
జీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	18	35
జిర్కినుకాయ	100	130	గోజగడ్డ	15	30
కాకరకాయ	50	70	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	50	70
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	70	చామగడ్డ	35	60
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	50	70
పుదీనా	70	100	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	50	75			

- ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఈ నగరానికి ఏమైంది-10.40
	ఎస్‌పీవై(తెలుగు)-1.30,4.30, 7.30,10.30
స్క్రీన్-2	ఎస్‌పీవై(తెలుగు)-10.30
	సామజవరగమన-1.20
	అదిపురుష్(తెలుగు) -7.25
	ఇండియానా జోన్స్(ఇంగ్లీష్)-4.30,10.45
స్క్రీన్-3	సత్యప్రేమ్‌కీ కథ(హిందీ)-10.35,1.35 4.30,10.20
	సామజవరగమన-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఎస్‌పీవై(తెలుగు) - 10.50,1.45, 4.40,7.35,10.30
స్క్రీన్-2	అదిపురుష్(తెలుగు)3డీ- 12.00,6.15, 10.00 - అశ్విన్స్(తెలుగు)-3.45
స్క్రీన్-3	సత్యప్రేమ్‌కీ కథ(హిందీ)-10.00,4.10 10.20
	సామజవరగమన(తెలుగు)-1.10,7.20
స్క్రీన్-4	ఇండియానా జోన్స్(ఇంగ్లీష్)- 3.20, 9.50 - సత్యప్రేమ్‌కీ కథ(హిందీ)-6.40
దేవి	ఎస్‌పీవై(తెలుగు)
నటరాజ్	సామజవరగమన
లలితామహాల్	ఈ నగరానికి ఏమైంది
విజయ్	ఆది పురుష్ (తెలుగు)

సంక్షిప్తం

నగరంలో రక్తదాన శిబిరం



నిజామాబాద్ సిటీ: నగరంలోని రెడ్‌క్రాస్‌లో బుధవారం జమాల్‌పూర్ విఠల్ వ్యాస్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత జర్నలిస్టు విఠల్ వ్యాస్ తృతీయ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 10 మంది యువకులు రక్తదానం చేశారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జమాల్‌పూర్ రాజశేఖర్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీమన్నారాయణ, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: చిరంజీవి సీనియర్ అభిమాని వేముల రమేష్ ఇటీవల మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి బీఎస్ఎస్ఎఫ్(భరత్‌సేవ శంకర ఫోరం) చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, నిజామాబాద్ చిరంజీవి యువత అధ్యక్షుడు కంటిపూడి విజయకుమార్ బుధవారం రూ.15,000 చెక్కును అందజేశారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

సుభాష్‌నగర్: రాష్ట్ర దళిత రత్న అవార్డ్ గ్రహీత ఐడీసీఎంఎస్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ సాయన్న (సాయికుమార్)ను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ బుధవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు శ్రీనివాస్ గౌడ్, కపిల్‌రెడ్డి, బిజినెస్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నిషిత డిగ్రీ కళాశాలలో బుధవారం ఎంబీఏ విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. కళాశాల డైరెక్టర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.